ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5  కర్ణాటక వార్తలు

శనివారం 3 ఫిబ్రవరి 2024

మార్చి 27 వరకు చెన్నై-మైసూరు వందేభారత్ రైలు

బెంగళూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): చెన్నై - మైసూరుల మధ్య వారానికోసారి నడిచే వందేభారత్ స్పెషల్ రైలు సేవలను పొడిగిస్తూ నైరుతి రైల్వే నిర్ణయం తీసుకుంది. నెం. 06037 డా. ఎంజీఆర్ చెన్నయ్ - మైసూరు వందేభారత్ రైలు సేవలు ఫిబ్రవరి 7 నుంచి ప్రారంభమై మార్చి 27 వరకు ఉంటాయి. కాగా 06038 మైసూరు-డా.ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ వందేభారత్ రైలు సేవలు కూడా మార్చి 27 వరకు ఉంటాయని ఇరువైపులా మొత్తం 8 ట్రిప్పుల మేరకు ఈరైలు సంచరించనుందని ప్రకటనలో తెలిపారు. ప్రయాణికుల నుంచి రైలుకు స్పందన బాగుండటంతోనే పొడిగించామని అధికారులు వెల్లడించారు.



ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు కాగడా అందజేస్తున్న కళాకారులు



విద్యుత్ కాంతులతో వెలిగిపోతున్న గాయత్రి వేదిక



చిరస్మరణీయం

- మానవత్వాన్ని పెంచి సమాజానికి మేలు చేయాలి
- హంపి ఉత్సవాలలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య

రాయుల వైభవం



సంప్రదాయ నృత్య ప్రదర్శనలో కళాకారులు

బళ్లారి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవ రాయల పాలనలో హంపి అంగరంగ వైభవంగా వెలిగొందిందని, ఆ నాటి చరిత్ర పరిశీలిస్తే నేలపైనే స్వర్గం తలపించేలా ఉండేదని ముఖ్యమంత్రి సిద్దరామయ్య అభిప్రాయపడ్డారు. శుక్రవారం చారిత్రక పట్టణం హంపిలో 'హంపి ఉత్సవాలు 2024' ఘనంగా ప్రారంభమయ్యాయి. గాయత్రి పీఠం వద్ద ఏర్పాటు చేసిన ప్రధాన వేదిక పై ముఖ్యమంత్రి మొదట భువనేశ్వరీ మాతకు పూజలు నిర్వహించిన అనంతరం ఢంకా మోగించి హంపి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి సీఎం సిద్దరామయ్య మాట్లాడుతూ నాటిసంస్కృతి, సంప్రదాయాలు, కళలు, ప్రజలకు తెలియజేసే ఉద్దేశంతో హంపి ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ సమాజంలో మానవత్వాన్ని పంచే విధంగా నడుచుకోవాలని, రాగద్వేషాలు పక్కన పెట్టి అందరూ సౌఖ్యంగా మెలగాలన్నారు. 1987లో నాటి ఎంపీ ప్రకాష్ కోరిక మేరకు హంపి ఉత్సవాలు ప్రారంభించామన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చే దిశలో కృషి చేస్తోం దని, ప్రతిపక్ష పార్టీలు సమాజంలో కులమత ద్వేషాలు రగిల్చి ప్రశాంత తను లేకుండా చేస్తున్నాయని ఆరోపించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఐదు హామీలను నెరవేర్చడం సాధ్యం కాదన్న బీజేపీ ప్రభుత్వం మా అజెండాను ప్రజల వద్దకు తీసుకెళ్ళే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విజయనగర జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్, బళ్లారి ఇన్‌చార్జ్ మంత్రి బి. నాగేంద్ర, రాష్ట్ర హో శాఖా మంత్రి పరమేశ్వర్, కన్నడ సంస్కృతి మంత్రి శివరాజ్, తంగడిగి, ఎమ్మెల్యేలు నేమిరాజ్ నాయక్, కృష్ణా నాయక్,ఎన్. శ్రీనివాస్, ఎంపీ లత, కేఎంఎఫ్ చైర్మెన్ భీమా నాయక్, జేఎన్. గణేష్, బీఎం నాగరాజు, రాఘవేంద్ర యత్నాళ్, ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి, ఎంపీ దేవేంద్రప్ప, జిల్లాధికారిఎం.ఎస్ దివాకర్, ఐజీపీ లోకేష్ కుమార్, జిల్లా ఎస్పీ శ్రీ హరి బాబు మాజీ ఎంపీ ఉగ్రప్ప, పద్మశ్రీ అవార్డు గ్రహీత మంజమ్మ జోగతి, కాంగ్రెస్ ప్రముఖ గోవర్ధన్ రెడ్డి, అన్నా నాగరాజు, విజయనగర, బళ్ళారి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రముఖులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి విజయనగర నియోజకవర్గం ఎమ్మెల్యే హెచ్.ఆర్.గవియప్ప అధ్యక్షత వహించారు.





విద్యుత్ కాంతుల్లో చారిత్రక స్మారకాలు



ఆకట్టుకుంటున్న అంబారీ సవారీ



సిరి ధాన్యాలతో వేసిన రంగు రంగుల ముగ్గు

బడ్జెట్‌కు ముందే శ్వేతపత్రం

- ఆర్థిక పరిస్థితిపై బీజేపీ ఆరోపణలు తిప్పికొట్టేందుకు కాంగ్రెస్ వ్యూహం



బెంగళూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): శాసనసభలో వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు ముందే రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ప్రత్యేక శ్వేతపత్రాన్ని రూపొందించడం ద్వారా గ్యారెంటీ పథకాలపై బీజేపీ చేస్తున్న ఆరోపణలను తిప్పికొట్టాలని ముఖ్యమంత్రి సిద్దరామయ్య నిర్ణయించారు. ఈమేరకు ఆర్థిక మంత్రిత్వశాఖ వర్గాలు శుక్రవారం సూచన ప్రాయంగా తెలిపాయి. గత ఐదేళ్ల అవధిలో ఆర్థిక పరిస్థితి, కేంద్రప్రభుత్వం గ్రాంట్ల విడుదలలో చూపిన తారతమ్యం ఇత్యాది అంశాలను గణాంక వివరాలతో సహా శ్వేతపత్రంలో పొందుపరచాలని ముఖ్యమంత్రి భావిస్తున్నట్టు సమాచారం. 2018లో హెచ్‌డీ కుమారస్వామి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆర్థిక క్రమశిక్షణను తుంగలోకి తొక్కిన అంశాలను, బొమ్మై ప్రభుత్వ హయాంలో చోటు చేసుకున్న ఆర్థిక అవకతవకలను కూడా శ్వేత పత్రంలో ప్రత్యేకంగా పొందపరచనున్నారు. ఇప్పటికే ఆర్థికమంత్రిత్వశాఖ అధికారులతో సీఎం సమావేశం జరిపి శ్వేతపత్ర రూపకల్పనపై చర్చించినట్టు తెలుస్తోంది. 2020-23 గడువులో రాష్ట్రవ్యాప్తంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి బిల్లు బకాయిలు అలాగే పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని తదనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ తీర్చుకుంటూ వస్తున్న అంశాన్ని కూడా శ్వేతపత్రంలో ఉదహరించనున్నట్టు సమాచారం. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఐదు గ్యారెంటీలతో రాష్ట్రం ఆర్థికంగా దివాళా తీసే స్థాయికి చేరుకుందంటూ ప్రతిపక్షమైన బీజేపీ చేస్తున్న ఆరోపణలను అంశాలవారీగా తిప్పికొట్టాలని ముఖ్యమంత్రి భావిస్తున్నారు. తన అదనపు ముఖ్యకార్యదర్శి ఎల్‌కే అతీక్‌తో గురువారం మంత్రిమండలి సమావేశం అనంతరం ప్రత్యేకంగా చర్చించారు. కేవలం ఆర్థికశాఖకు చెందిన కొద్దిమంది ఉన్నతాధికారులు మాత్రమే ఈ సమావేశంలో పాల్గొన్నారు. 2018 నుంచి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని కళ్లకు కట్టేలా సంవత్సరాల వారీగా ప్రకటించాలని కేంద్ర బడ్జెట్ గాత్రం పెరిగినా కూడా రాష్ట్రానికి కేటాయింపుల మొత్తం పెరగకపోవడం, జీఎస్టీ విషయంలో జరుగుతున్న అన్యాయం, ఐటీబీటీ ఎగుమతులలో లభిస్తున్న ఆదాయం అంశాలను శ్వేతపత్రం లో పొందుపరిచే అవకాశం ఉన్నట్టు ఆర్థికశాఖ వర్గాలు వెల్లడించాయి.

బీజేపీవి అన్నీ అబద్ధాలే..

: సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): బసవణ్ణ ఆశయాలను పాటిస్తున్నానని గతంలోనూ ఇచ్చిన హామీలను అమలు చేశానని బీజేపీ వారి అబద్ధాలను నమ్మరాదని సీఎం సిద్దరామయ్య పిలుపునిచ్చారు. విజయపుర జిల్లా ముద్దేబిహాళ్ తాలూకాలో శుక్రవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. కష్టపడేవారు ఎవరో, సుఖంగా అనుభవించేవారు మరెవరో అనే పరిస్థితి సమాజంలో ఉండేదని అగ్ర, నిమ్న అనే తారతమ్యాలను రూపుమాపాలని బసవణ్ణ నేతృత్వంలో వచనక్రాంతి ప్రారంభమైందని, కర్మసిద్ధాంతాన్ని పూర్తిగా బసవణ్ణ తిరస్కరించారన్నారు. అందుకే శతాబ్ధాలు ముగిసినా బసవణ్ణ ఆశయాలు ఇంకా సమాజంలో ఉన్నాయన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే విషయంలో గతంలో ఐదేళ్ల ప్రభుత్వంలో సాధ్యం చేశానని, ప్రస్తుతం అదే మార్గంలో ఐదు గ్యారెంటీలను ప్రజలకు అందించామన్నా రు. ప్రజలను తప్పుదారి పట్టించి మోసం చేసేలా బీజేపీ వ్యవహరిస్తోందన్నారు. రాష్ట్రప్రభుత్వంలో ఖజానా ఖాళీ అని అబద్ధాలు పుట్టిస్తున్నారన్నారు. ఖజానాలో సొమ్ము లేకుంటే గ్యారెంటీలు ఎలా అమలు చేస్తామన్నారు. అభివృద్ధి పనులు ఎలా కొనసాగిస్తామని ప్రశ్నించారు. మార్చి 20న ఎన్నికల ప్రచారానికి వచ్చినప్పుడు కొన్ని హామీలు ఇచ్చామని వాటిని పరిష్కరిస్తానని భరోసా ఇచ్చేందుకు మరోసారి వచ్చానన్నారు. కవడిమట్టి గ్రామంలో క్రాంతివీర సంగొళ్ళిరాయణ్ణ కాంస్య విగ్రహానికి పూలు చల్లి నివాళులు అర్పించారు. ముద్దేబిహాళ్ ఎమ్మెల్యే అప్పాజి సీఎస్ నాడగౌడ అధ్యక్షత వహించగా జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఎంబీ పాటిల్, మంత్రి శివానంద పాటిల్‌తోపాటు ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు పాల్గొన్నారు.



సమావేశంలో సీఎం సిద్దరామయ్య తదితరులు

నేనేం ఫుట్‌బాల్ కాదు..

- సీఎం చెప్పినా ఎంపీగా పోటీ చేయను : ఎమ్మెల్సీ ప్రకాశ్ హుక్కేరి

బెంగళూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): తానేమీ ఫుట్‌బాల్ కాదని కాంగ్రెస్‌లో తనను ఆ తరహాలో వాడుకోరాదని ఎట్టి పరిస్థితుల్లోనూ వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేది లేదని ఎమ్మెల్సీ ప్రకాశ్ హుక్కేరి స్పష్టం చేశారు. సీఎం సిద్దరామయ్య సూచించినా తాను పోటీ చేసే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. చిక్కోడి లోక్‌సభ స్థానం నుంచి ప్రకాశ్ హుక్కేరి అభ్యర్థి అవుతారని పార్టీలో ప్రచారం కొనసాగుతున్న తరుణంలోనే హుక్కేరి వ్యాఖ్యానించారు. చిక్కోడి తాలూకా కెరూరు గ్రామంలో సంతుబాయి ఎత్తిపోతల పథకాన్ని శుక్రవారం ప్రారంభించిన సందర్భంలో ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో ఎమ్మెల్యేగా ఉండగా రాజీనామా చేయించి పరిషత్‌కు పంపారని, ప్రస్తుతం ఎమ్మెల్సీగా సంతృప్తికరంగా ఉన్నానన్నారు. మళ్లీ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయాలంటే తనను ఏమైనా ఫుట్‌బాల్ అనుకున్నారా..? అని ప్రశ్నించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఢిల్లీవైపు వెళ్లనన్నారు. తాను ఎన్నికల్లో పోటీ చేస్తానని ఎక్కడా వ్యాఖ్యానించలేదన్నారు. అలాగని సీఎం సిద్దరామయ్యకు రాసివ్వలేదన్నారు. ఎక్కడా అటువంటి నిబంధనలు లేవన్నారు. టీచర్ ఎమ్మెల్సీ స్థానం నుంచి తనను గెలిపించారని మరో ఐదేళ్ల పదవీకాలం ఉందన్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం తనను పోటీ చేయాలని ఒత్తిడి తీసుకురాకూడదన్నారు. ఎవరు సూచించినా పోటీ చేసేది లేదని స్పష్టం చేస్తానన్నారు. గతంలో లోక్‌సభ సభ్యుడిగాను వ్యవహరించానన్నారు.



డీకే సురేష్‌పై కేసు కట్టండి


- కోర్టును ఆశ్రయించిన న్యాయవాది
- ప్రత్యేక దేశం అన్నందుకు..

బెంగళూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక దేశం నినాదం చేసిన కాంగ్రెస్ ఎంపీ డీకే సురేశ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని మంగళూరుకు చెందిన న్యాయవాది వికాస్ శుక్రవారం కోర్టును ఆశ్రయించారు. మంగళూరులోని రెండో జేఎంఎఫ్‌సీ కోర్టులో ఎంపీ సురేశ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేసేలా సూచించాలని పిటీషన్ సమర్పించారు. డీకే సురేశ్ వ్యాఖ్యలు దేశద్రోహానికి సంబంధించినవని పేర్కొన్నారు. ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా కోర్టు సూచించాలని పిటీషన్‌లో అభిప్రాయపడ్డారు. ఐపీసీ 124ఏ సెక్షన్‌కింద డీకే సురేశ్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. మంగళూరు నగర పోలీస్ కమిషనర్‌కు ఎఫ్ఆర్ నమోదు చేసే దిశగా సూచించాలని పిటీషన్ ద్వారా విన్నవించారు. బడ్జెట్‌లో ఉత్తర భారత్‌కు ఎక్కువ గ్రాంట్లు కేటాయిస్తున్నారని దక్షిణభారత్‌కు అన్యాయం జరుగుతోందని ఎంపీ డీకే సురేశ్ కేంద్ర బడ్జెట్ అనంతరం ఢిల్లీలో వ్యాఖ్యానించారు.



పాంచ్..పడింది..!

- ఐదో స్థానానికి మైత్రి అభ్యర్థి
- రాజ్యసభ ఎన్నికల్లో కొత్త ట్విస్ట్
- ఖంగుతిన్న కాంగ్రెస్
- 'గాలి' మద్దతు బీజేపీకేనా..?




బెంగళూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీకి చెక్ పెట్టేందుకు బీజేపీ-జేడీఎస్ మైత్రి కూటమి ఐదో అభ్యర్థిని రంగంలోకి దించేందుకు సిద్ధమైంది. ఈ పరిణామం కాంగ్రెస్ పార్టీకి కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఈనెల 27న రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి. శాసనసభలో ప్రస్తుతం ఉన్న బలాబలాల ప్రకారం కాంగ్రెస్ 3, బీజేపీ 1 స్థానంలో సులభంగా గెలుపు సాధించనుంది. కాంగ్రెస్ పార్టీలో అసంతృప్తితో ఉన్న వారి మద్దతుతో అభ్యర్థిని గెలిపించుకునేందుకు బీజేపీ-జేడీఎస్ పార్టీలు వ్యూహాలు పన్నుతున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే జేడీఎస్ నేత కుమారస్వామి పలువురు కీలక బీజేపీ నేతలతో చర్చలు జరిపారు. మైత్రి అభ్యర్థిగా రాజ్యసభ మాజీ సభ్యుడు కుపేంద్రరెడ్డిని రంగంలోకి దించే ఆలోచన ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో మాజీ మంత్రి సోమణ్ణ చేత పోటీ చేయించాలని భావించారు. వీరశైవలింగాయత సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు ఆయనకు మద్దతు ఇస్తారని అంచనా వేశారు. అయితే సోమణ్ణ ఇటీవల శాసనసభ ఎన్నికల్లో జరిగిన అవమానం చాలని, మరోసారి ఇలాంటి ప్రయోగాలు నాపై వద్దంటూ తిరస్కరించినట్లు తెలుస్తోంది. దీంతో కుపేంద్రరెడ్డిని మైత్రి అభ్యర్థిగా రంగంలోకి దించేందుకు దాదాపుగా ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ఐదవ అభ్యర్థిని పోటీ చేయించే విషయంలో బీజేపీ అధ్యక్షుడు విజయేంద్ర, ప్రతిపక్షనేత అశోక్‌లు కూడా సుముఖత వ్యక్తం చేసి కుమారస్వామితో చర్చించినట్టు సమాచారం. శాసనసభలో 224 స్థానాలు కాగా అధికార కాంగ్రెస్‌కు 135మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఇండిపెండెంట్‌లు విజయనగర జిల్లా హరపనహళ్ళి ఎమ్మెల్యే లతా మల్లికార్జున, గౌరిబిదనూరు కే పీ పుట్టస్వామిలు పరోక్షంగా మద్దతు ఇస్తున్నారు. బీజేపీ తరపున 66మంది ఎమ్మెల్యేలు కాగా జేడీఎస్‌కు 19మంది ఉన్నారు. రాజ్యసభ ఎన్నికల్లో ఒక అభ్యర్థి గెలవాలంటే 45మంది మద్దతు అవసరం. బీజేపీ సొంతంగా ఒక అభ్యర్థిని గెలిపించుకున్నాక 21 ఓట్లు అదనంగా ఉంటాయి. వారికి జేడీఎస్‌కు చెందిన 19మంది కలిపితే 40 కానున్నాయి. ఇండిపెండెంట్‌లతోపాటు గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్ధనరెడ్డి మద్దతు పొందితే మరో ఇద్దరి సహకారం అవసరం కానుంది. రాజ్యసభ ఎన్నికల్లో ఎమ్మెల్యేలకు విప్ జారీ విధానం ఉండదు. అయితే ఎన్నికల ఏజెంట్‌లకు తప్పనిసరిగా ఓటు చూపించాల్సి ఉంటుంది. ఏజెంట్‌లకు చూపకుండానే ఓటు వేస్తే చెల్లని ఓటుగా ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేయవచ్చు. గతంలో రాజ్యసభ ఎన్నికల వేళ ఏడుమంది జేడీఎస్ ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడిన విషయం తెలిసిందే. అయితే బీజేపీ ఎత్తులతో కాంగ్రెస్ ఖంగు తిన్నట్లయ్యింది. ఎలా గైనా సీటు దక్కించుకోవాలని మరిన్ని ఎత్తుగడలు వేస్తున్న ట్లు తెలుస్తోంది. తమ పార్టీలో అసంతృప్త నేతలను జారిపోకుండా జాగ్రత్తలు తీసుకోవడంలో డీసీఎం శివకుమార్ తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.









తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1588.29	1,615.87
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	361	8,056
సామర్థ్యం (టీఎంసీలు)	9.66	50.51

టెలీ ఐసీయూ హబ్ ప్రారంభం



ఐసీయూ హబ్‌ను ప్రారంభిస్తున్న ఉపముఖ్యమంత్రి

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 2: కళ్యాణకర్ణాటకలోని మొదటి టెలీ ఐసీయూ హబ్‌ను శుక్రవారం బళ్లారి జిల్లా ఆసుపత్రిలో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వర్చువల్ పద్ధతి ద్వారా ప్రారంభించారు. కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం స్థానికంగా పేదలకు నాణ్యమైన ఆరోగ్య సేవలను అందించడానికి దీనిని ప్రాంభించింది. ఈసందర్భంగా రాష్ట్రస్థాయి ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖమంత్రి దినేష్ గుండురావు, రేవణ్ణ, హబ్ హెడ్ నాదముని, ఫౌండేషన్ సీనియర్ అధికారులు పాల్గొన్నారు. జిల్లాస్థాయిలో ఎమ్మెల్యేలు, నారాభరత్‌రెడ్డి, డాక్టర్ బసారెడ్డి, మేయర్ శ్వేత, వివిధ జిల్లాలనుంచి వచ్చిన నిపుణులైన వైద్యులు, ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్ పనులకు భూమిపూజ



పైపులైన్ పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

సిరుగుప్ప, ఫిబ్రవరి 02 : రూ.25 లక్షల వ్యయంతో తాగునీటిపైపులైన్ ఏర్పాటు పనులకు ఎమ్మెల్యే బీఎం నాగరాజ శుక్రవారం భూమిపూజ చేశారు. సిరుగుప్ప తాలుకాలోని ఆగలూరు హోసళ్లి గ్రామంలో ఈ పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామంలో తాగునీటి సమస్య కారణంగా పైపులైన్ ఏర్పాటైతే ప్రజలకు తాగునీటి సమస్య వుండదన్నారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా ఉచ్చురేశ్వరస్వామి రథోత్సవం



భక్తజనసందోహం నడుమ మహారథోత్సవం

సిరుగుప్ప, ఫిబ్రవరి 2 : తాలుకాలోని టెక్కలకోట పట్టణంలో వెలసిన ఉచ్చురేశ్వరస్వామి తాత రథోత్సవం శుక్రవారం ఎంతో వైభవంగా జరిగింది. సిరుగుప్ప భక్తులు రథోత్సవం సందర్భంగా పూలు, పండ్లు విసిరి మొక్కుబడులు తీర్చుకున్నారు. తాళమేళాలతో, డోలు ఢమరులతో, వివిధ వేషభూషణలతో భక్తులు రథోత్సవాన్ని నిర్వహించారు. వేలాది మంది భక్తులు ఈ రథోత్సవంలో పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్.. ప్రజావ్యతిరేకం

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 2: నిర్మలా సీతారామన్ విడుదల చేసిన బడ్జెట్ అభివృద్ధి వ్యతిరేకమని మాజీ ఎంపీ వి.ఎస్.ఉగ్రప్ప అన్నారు. నగరంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2014లో మనకు రూ.52లక్షల కోట్ల రుణాలు ఉండేవని, ప్రస్తుతం ఆ రుణ భారం రూ.192 లక్షల కోట్లకు చేరుకుందన్నారు. దేశంపై అప్పుల భారం మోపడం సరికాదన్నారు. రామభక్తుడైన మోదీ దేశాన్ని అప్పుల పాలు చేశారన్నారు. రైతులు పండించిన పంటలకు శాస్త్రీయంగా ధర నిర్ణయించే కార్యక్రమాన్ని రూపొందించలేదని, అందుకే ఇది అభివృద్ధి వ్యతిరేక వ్యతిరేక బడ్జెట్ అన్నారు. నల్లధనాన్ని వెనక్కి తీసుకువస్తానన్న మోదీ తన వాగ్దానాన్ని తుంగలో తొక్కారన్నారు.

కనువిందు చేస్తున్న హంపీ ఉత్సవాలు

రైతు రాజ్యం



సిరిధాన్య సమ్మేళనంలో ఎద్దులబండ్లు, రైతుల పనిముట్లు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

ఆకట్టుకుంటున్న ముగ్గులు



ఉత్సవాలలో భాగంగా శుక్రవారం ఉదయం ముగ్గుల పోటీలు నిర్వహించారు. గెలిచిన వారికి బహుమతులు అందించారు.

మత్స్యమేళా



హంపీలో ప్రారంభమైన మత్స్యమేళాలో సందర్శకులను ఆకట్టుకుంటున్న వివిధ రకాల చేపలు

గణాధిపతయేనమః



హంపీ నగరానికి ప్రధాన ఆకర్షణగా నిలిచే కడ్లేకాయ వినాయకుడీయనే. మొదటగా గణేశ సంకీర్తనలతో మహిళలు ఉత్సవాలను ప్రారంభించారు.

సన్మానం



హంపీ ఉత్సవాలకు వచ్చిన ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు మంత్రులు జమీర్ అహ్మద్, నాగేంద్ర, ఎమ్మెల్యే గణేష్, నారా భరత్ రెడ్డి తదితరులు ఘన స్వాగతం పలికారు. హంపీ ఉత్సవాలను కలసికట్టుగా విజయవంతం చేయాలని సూచించారు.

కంప్లి, హోస్పేట, ఫిబ్రవరి 02 : హంపీ ఉత్సవాలు పర్యాటకులకు కనువిందు చేశాయి. అన్ని ప్రదర్శనలు ఆకట్టుకునేలా ఇన్‌చార్జి మంత్రులు జమీర్‌అహ్మద్, ఎమ్మెల్యే గవప్ప, అధికారులు దివాకర్ చర్యలు తీసుకున్నారు. శుక్రవారం ఉదయం ముగ్గుల పోటీలు నిర్వహించారు. గెలిచిన వారికి బహుమతులు అందించారు. కమలాపురంపంచాయతీ సిబ్బందికి కూడా వీఐపీ పాస్‌లు అందించి జిల్లా అధికారులు వారిని ఆహ్వానించారు. మాతంగి పర్వత మైదానంలో సిరి ధాన్యమేళా ఆకట్టుకుంది. ఇందులో రైతులు ఎద్దుల బండ్లు, కమల్ మహల్, రైతుల పనిముట్లు, సిరి ధాన్యాలు ఆకర్షణగా నిలిచాయి. అంబారీ ఊరేగింపుతో పాటు కడ్లేకాయ వినాయకుని వద్ద కూడా సంకీర్తనలతో మహిళలు ఆకట్టుకున్నారు. ఎక్కడ చూసినా దేవాలయాల ముందు పర్యాటకులు కనిపిస్తున్నారు. అలాగే మత్స్యమేళా కూడా ప్రారంభించారు. ఇందులో వివిధ రకాల చేపలు పూర్తిగా ఆకట్టుకున్నాయి. దీనికి తోడు స్కైబై అందరినీ ఆకర్షిస్తోంది. విహంగవీక్షణ కోసం జనం బారులు తీరుతున్నారు.

కమలమహల్



విదేశీ రాయబారులతో కృష్ణ రాయలు చర్చలు జరిపే కమల మహల్ ఇది. వేసవి కాలంలో కూడా చల్లగా ఉండడం దీని ప్రత్యేకత



పశు సంవర్ధక శాఖ స్టాల్‌ను ప్రారంభిస్తున్న జమీర్ అహ్మద్

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 2: రానున్న వేసవి రోజుల్లో ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లాఇన్‌చార్జి మంత్రి బి.నాగేంద్ర ఆదేశించారు. నగరంలోని జిల్లాపంచాయితీ హాల్లో శుక్రవారం జరిగిన ప్రగతి సమీక్షా సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఈ ఏడాది కరువు కారణంగా భూగర్భ జలాలు పడిపోయాయన్నారు. అంతేకాకుండా కాలువల్లో నీటి సరఫరా నిలిచిపోయిందని, అందు వలన వేసవిలో ప్రజలకు సమస్య తలెత్తకుండా చెరువులను ముందుగా నీటితో నింపాలన్నారు. ఇందుకోసం ఎల్‌ఎల్‌సీ కాల్వలకు నీటిని విడుదల చేస్తామన్నారు. ఆనీటిని రైతులు సాగు నీటి అవసరాలకు వినియోగించకుండా జిల్లాయంత్రాంగం చూడాలన్నారు. వేసవిలో ఎట్టి పరిస్థితుల్లోనూ నీటి సమస్య ఉండకూడదన్నారు. ఇందుకు అవసరమైన నిధులు జిల్లాయంత్రాంగం వద్ద ఉన్నాయని తెలిపారు. బళ్లారి నగరానికి నీటిని సరఫరా చేసే అల్లీపుర చెరువు 7.5మీటర్లు నిండిందని, పూర్తిగా నింపేందుకు పనులు చేపట్టాల్సి ఉందన్నారు. గత సమావేశాల తీరుపైన కూడా చర్చ జరిగింది.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నాగేంద్ర

ట్రాక్టర్‌ను ఢీ కొని ఆర్టీసీ బస్సు బోల్తా.. 30 మందికి గాయాలు



బళ్లారి గాంధీనగర్, ఫిబ్రవరి 2: చెళ్ళకెర తాలూకా చిక్కహళ్ళి గ్రామం వద్ద శుక్రవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇటుకల లోడ్‌తో వెళుతున్న ట్రాక్టర్‌ను కెఎస్‌ఆర్టీసి బస్సు ఢీ కొన్న ఘటనలో బస్సు ప్రక్కన ఉన్న గోతిలోకి బోల్తాప డింది. బస్సులో ప్రయాణిస్తున్న 30మందికి పైగా గాయపడ్డారు. గాయపడినవారిని చెళ్ళకెర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వివాహ శుభకార్యానికి ఆన్ కాంట్రాక్ట్‌పై కెఎస్‌ఆర్టీసి బస్సు గుల్బర్గా నుండి మాగడికి వెళుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. శుక్రవారం తెల్లవారు జామున తళుకు పోలీసు స్టేషన్ పరిధిలో చిక్కహళ్ళి గేటు వద్ద ముందు ఇటుకల లోడుతో వెళుతున్న ట్రాక్టర్‌ను బలంగా ఢీ కొనడంలో బస్సు అదుపు తప్పి ప్రక్కనే ఉన్న గోతిలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బస్సులో వివాహ శుభ కార్యానికి వెళుతున్న అందరూ తీవ్రంగా గాయపడ్డారు. తళుకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గడువులోగా పనులు పూర్తి చేయాలి

బళ్లారి సిటీ.ఫిబ్రవరి 2: కళ్యాణ్ కర్ణాటక డెవలప్‌మెంట్ బోర్డు ద్వారా జిల్లాకు అందజేసిన గ్రాంట్‌ను నిర్ణీత వ్యవధిలో వినియోగించి సరైన ప్రగతిని సాధించాలని కలబురగి కళ్యాణ్ కర్ణాటక రిజియన్ డెవలప్‌మెంట్ బోర్డు చైర్మన్, జీవర్గి ఎమ్మెల్యే అజయ్ సింగ్ అధికారులకు సూచించారు. జిల్లాపంచాయితీ హాల్లో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రగతి సమీక్షా సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. జిల్లాలో కేకేఆర్‌డీబీ పథకం కింద చేపట్టిన పనుల్లో వేగం పెంచాలని. అందుబాటులో ఉన్న గ్రాంట్లను సద్వినియోగం చేసుకుంటేనే మరిన్ని గ్రాంట్లు విడుదల చేసేందుకు అనుకూలంగా ఉంటుందన్నారు. నాణ్యతలేని పనులు చేస్తే గ్రాంట్ విడుదలయ్యేది లేదని అధికారులకు సూచించారు. కళ్యాణ అక్షర అవిష్కార్ యోజన కింద కర్ణాటకలోని పాఠశాలలకు ప్రత్యేక గ్రాంట్లు ఇచ్చారు. జిల్లాలో రానున్న పదవతరగతి ఫలితాల్లో గణనీయమైన ప్రగతి సాధించాలన్నారు. మంత్రి నాగేంద్ర మాట్లాడుతూ జిల్లాలో కేకేఆర్‌డీబీ గ్రాంట్ ఉందని, ఈబోర్డు ద్వారా విడుదలైన గ్రాంట్‌లో వంద శాతం నిధులు వినియోగించుకుని తగిన పురోగతి సాధించాలన్నారు. జిల్లా కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో రూ. 20621 లక్షలు ఖర్చు చేసినట్లు తెలియ జేశారు. కేకుఆర్‌డీబీ కార్యదర్శి సందరేశ్ బాబు మాట్లాడుతూ నిలిచిపోయిన పనులకు కొత్త టెండర్లు పిలిచి పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈసందర్భంగా కర్ణాటక చేనేత అభివృద్ధి సంస్థ అధ్యక్షుడు , కంప్లి ఎమ్మెల్యే గణేశ్, సండూర్ ఎమ్మెల్యే తుకారం, సిరుగుప్ప ఎమ్మెల్యే నాగరాజు, బళ్లారి నగర ఎమ్మెల్యే భరత్‌రెడ్డి, జిల్లాపంచాయితీ అధికారి రాహుల్‌శరణప్ప, జిల్లా ఎస్పీ రంజిత్ కుమార్ బండారు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



యువ సమృద్ధి సమ్మేళన పోస్టర్లను విడుదల చేస్తున్న అధికారులు

హోసూరు జోన్

రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

హోసూరు (మత్తిగిరి) ఫిబ్రవరి 2 : హెల్మెట్‌ల ప్రాముఖ్యత, రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పోలీసులు స్థానిక రవాణా శాఖ ఆధ్వర్యంల్లో హోసూరుల్లో ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించారు, ఇందుల్లో పలువురు పాల్గొని, అవగాహన కల్పించారు. గాంధీ విగ్రహం ముందు నిర్వహించిన ర్యాలీని డీఎస్పీ బాబు ప్రశాంత్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ పాత బెంగళూరు రోడ్డు ఏఎస్‌టీసీ డిపో, చెన్నై బెంగళూరు జాతీయ రహదారి, బాగలూరు రోడ్డు మీదుగా జిల్లా రవాణాశాఖ కార్యాలయానికి చేరుకుంది. ఇందుల్లో 250 మందికి పైగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి , రోడ్డు నిబ్బందనలపై అవగాహన బ్యానర్లు పట్టుకుని, నగరంలోని ప్రధాన రహదారుల గుండా సుమారు నాలుగు కిలోమీటర్ల దూరం ప్రయాణించారు, ఈ అవగాహన ర్యాలీల్లో పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు, వాలంటీర్లు, ప్రజలు, పెద్ద సంఖ్యల్లో పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో ఆవులు, గేదెల మృతి

రాయచూరు, ఫిబ్రవరి 2 : జిల్లాలోని సింధనూరు నగర సమీపం ఒళబళ్ళారి రోడ్డులో గురువారం అర్ధ రాత్రి జరిగిన ఒక అగ్ని ప్రమాదంలో నాల్గు ఆవులు, మరో నాల్గు గేదలు కాలి బూడిదయ్యాయి. సింధనూరు నగరం 30వ వార్డులో నివశిస్తున్న ఈరప్ప నగర సమీపంలో వెడ్డు వేసి తన పశువులను ఉంచారు. ఎదావిధిగా గురువారం రాత్రి వాటికి మేతవేసి ఇంటికి తిరిగి వచ్చాడు. అర్ధరాత్రి 1,2 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా శెడ్డుకు నిప్పంటుకుని మంటలు చెలరేగుతుండడాన్ని గమనించిన సమీపంలోని ఇతర పొలం యజమాని ఆయనకు ఫోన్ ద్వార సమాచారం ఇచ్చాడు. వెంటనే అక్కడికి చేరుకున్న ఈరప్ప అప్పటికే శెడ్డు, పశువులు కాలిపోయినట్లు గుర్తించాడు విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడి చేరుకుని మంటలార్పే ప్రయత్నం చేసినప్పటికే శెడ్డుతో పాటు అందులో ఉన్న పశువులు, సమీపంలోని గడ్డివాములు పూర్తిగా అగ్నికి ఆహుతైయ్యాయి. పశుసంవర్ధక శాఖ అధికారులు స్థళాన్ని పరిశీలించి వెళ్లారు. కాగా ప్రమాదం వార్త తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు బాదితుడిని పరమార్శించి ప్రభుత్వ పరంగా సహాయం అందించేందుకు కృషి చేస్తామన్నారు.

పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దాలి

రాయచూరు, ఫిబ్రవరి 2 : జాతీయ గ్రామీణ ఉపాదిహామి పథకంలో పని చేసే కూలీలు తమ పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దాలని జడ్పీ సీఈఓ రాహుల్ తుకారాం పాండ్వే సూచించారు. రాయచూరు తాలూకాలోని శాఖవాది గ్రామంలో శుక్రవారం ఉపాదిహామి పథకం ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కూలీకార్మికులతో కలిసి కేక్ కట్ చేసి వారికి శుభాకాంక్షలు తెలిపిన జడ్పీ సీఈఓ కార్మికులు తమ పిల్లలను విధిగా పాఠశాలలకు, కళాశాలలు పంపాలని సూచించారు. ఉన్నత విద్యావంతులుగా సమాజంలో సుస్థిర స్థానంలో ఉన్నవారందరు కూలీ పని చేసే తల్లిదండ్రుల కడుపున జన్మించినవారేనని వారికి వివరించారు.



ప్రసంగిస్తున్న జడ్పీ సీఈఓ రాహుల్ తుకారాం పాండ్వే

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

నోర్మన్ రాక్‌వెల్ (జయంతి)




నోర్మన్ రాక్‌వెల్ 1894 ఫిబ్రవరి 3న జన్మించారు. అమెరికాకు చెందిన చిత్రకారుడు, ఇల్లుస్ట్రేటర్. అమెరికా సంస్కృతికి ప్రతీకగా 4వేలకుపైగా కళా ఖండాలు గీశారు. 40కుపైగా పుస్తకాలకు బొమ్మలు రూపొందించారు. కెన్నెడీ, జాన్సన్, నిక్సన్, జవహర్‌లాల్ నెహ్రూ వంటి ప్రముఖుల చిత్తరువులు గీసి ప్రశంసలు పొందారు. 'ది సాటర్‌డే ఈవెనింగ్ పోస్ట్' మ్యాగజైన్‌కు 50ఏళ్ల పాటు ఇల్లుస్ట్రేటర్‌గా వ్యవహరించారు. సిల్వర్ బఫెలో అవార్డ్ పొందారు. నోర్మన్ రాక్‌వెల్ మ్యూజియంలో ఆయన గీసిన 700కుపైగా కళాఖండాలు, బొమ్మలు, పుస్తకాలు ఉన్నాయి. 1978 నవంబరు 8న కన్నుమూశారు.

అణ్ణాదురై (వర్ధంతి)



కాంజీవరం నటరాజన్ అణ్ణాదురై 1909 సెప్టెంబరు 15న కాంచీపురంలో జన్మించారు. 'అణ్ణా'గా పేరొందారు. తమిళనాడు రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి. మంచి వక్తగా పేరొందారు. దేశంలో అత్యధిక మెజారిటీతో కాంగ్రెసేతర తొలి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఘనత ఆయనదే. రచయితగా పలు నాటకాలు రాయడమే కాక నటించారు. ఆయన రచనలు కొన్ని సినిమాలుగా రూపుదిద్దుకున్నాయి. దూరదృష్టి గల నేతగా ఎన్నో సంక్షేమాలకు శ్రీకారం చుట్టారు. ద్రవిడ రాజకీయాలలో కీలకంగా వ్యవహరించారు. గురువు పెరియార్‌తో విభేదాలు రావడంతో సొంతంగా ద్రవిడ మున్నేట్ర కళగం పార్టీని స్థాపించారు. డీఎంకే పార్టీ తొలి జనరల్ సెక్రటరీగా సుదీర్ఘకాలం వ్యవహరించారు. ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా, రాజ్యసభ సభ్యుడిగా పలు హోదాలలో కొనసాగారు. 1969 ఫిబ్రవరి 3న కన్నుమూశారు.

అల్లా రఖా (వర్ధంతి)



'పద్మశ్రీ' గ్రహీత ఖురేషి అల్లా రఖా ఖాన్ 1919 ఏప్రిల్ 29న జమ్ము-కశ్మీర్‌లో జన్మించారు. 'అల్లా రఖా'గా పేరొందారు. తబలా కళాకారుడైనా హిందూస్థానీ శాస్త్రీయ సంగీతంలో నిష్ణాతులు. ఎక్కువగా రవి శంకర్, బడే గులాం అలిఖాన్, అల్లావుద్దీన్ ఖాన్‌లకు వాద్యసహకారం అందించారు. తబలా కళాకారుడు ఉస్తాద్ జాకీర్ హుస్సేన్ ఆయన కుమారులలో ఒకడు. సోలో గాయకుడిగాను, కంపోజర్‌గాను తనదైన గుర్తింపు పొందారు. తబలా వాద్య కళాకారుడిగా ప్రపంచవ్యాప్తంగా పేరొందారు. సంగీత నాటక అకాడమీ తదితర అవార్డులు పొందారు. 2003 ఫిబ్రవరి 3న కన్నుమూశారు.

వహీదా రెహమాన్ (పుట్టినరోజు)



'పద్మభూషణ్' గ్రహీత వహీదా రెహమాన్ 1938 ఫిబ్రవరి 3న తమిళనాడు రాష్ట్రం చెంగల్పట్టులో జన్మించారు. బాలీవుడ్‌లో పేరొందిన, అందమైన నటి. 1950, 60, 70 దశకాలలో వివిధ తరం నటులతో నటించారు. ప్రత్యేకించి 'గురుదత్' దర్శకత్వంలో ప్యాసా, కాగజ్ కే ఫూల్ తదితర సినిమాలు ఆమెకు గుర్తింపు తెచ్చాయి. తెలుగు, తమిళ, బెంగాలీ, మళయాళం భాషల సినిమాలలో సైతం నటించారు. ఒక జాతీయ, రెండు ఫిల్మ్‌ఫేర్, సెంటెనరీ అవార్డ్ ఫర్ ఇండియన్ ఫిల్మ్ తదితర పురస్కారాలు పొందారు. మానవతావాదిగాను గుర్తింపు పొందారు.

రఘురామ్ రాజన్ (పుట్టినరోజు)



దేశంలో ప్రముఖ ఆర్థికవేత్తలలో ఒకరైన రఘురామ్ గోవింద రాజన్ 1963 ఫిబ్రవరి 3న భోపాల్‌లో తమిళ కుటుంబంలో జన్మించారు. చికాగో బూత్ స్కూల్ ఆఫ్ బిజినెస్ యూనివర్శిటీలో ప్రొఫెసర్. ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్ (ఐఎంఎఫ్)కు 2003-06 మధ్య చీఫ్ ఎకనమిస్ట్‌గా, పరిశోధక డైరెక్టర్‌గా వ్యవహరించారు. రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాకు 2013 నుంచి 2016వరకు 23వ గవర్నర్‌గా వ్యవహరించారు. లండన్ బిజినెస్ స్కూల్, హాంకాంగ్ యూనివర్శిటీ ఆఫ్ టెక్నాలజీలచే గౌరవ డాక్టరేట్‌లు అందుకున్నారు.

అన్నం పెట్టలేదని కన్నతల్లిని చంపిన విద్యార్థి

బెంగళూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కళాశాలకు వెళ్ళేందుకు సమయం మించిపోతున్నా అన్నం పెట్టలేదని ఆగ్రహంతో తల్లిని చంపిన కన్నకొడుకు ఉదంతం బెంగళూరు నగరం కేఆర్‌పుర పరిధిలోని భీమయ్య లేఅవుట్‌లో చోటుచేసుకుంది. శుక్రవారం ఉదయం 7 గంటలకు 18ఏళ్ల కుమారుడు కళాశాలకు వెళ్ళేందుకు సిద్ధమయ్యాడు. ఇదే సమయంలో తల్లి వాగ్వాదం చేశారు. కోపంతో ఆమె నీవు నా కొడుకువే కాదని ఇలా వేధిస్తే ఎలాగని మందలించారు. అంతలోనే ఆగ్రహానికి లోనైన కుమారుడు ఐరన్ రాడ్‌తో తల్లి తలపై బలంగా కొట్టాడు. వెంటనే ఆమె అక్కడికక్కడే కుప్పకూలిపోయింది. తల్లి ఎంతసేపటికీ కదలకపోవడంతో మృతి చెందినట్టుగా భావించి నేరుగా కేఆర్‌పుర పోలీస్ స్టేషన్‌కు చేరుకుని లొంగిపోయాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

విషపు గడ్డి తిని 42 గొర్రెలు మృతి

పావగడ, ఫిబ్రవరి 2: తాలూకా పరిధిలోని వడ్రేవు గ్రామంలో విషపు గడ్డి తిని 42 గొర్రెలు, మేకలు మృతి చెందాయి. గ్రామ రైతులైన గోపాల, అంజప్ప గొర్రెలు, మేకలు మేపేందుకు తమ తోట సమీపంలో ఉన్న బొప్పాయి తోటలోకి తోలుకెళ్లారు. అవి మేస్తూ మేస్తూ పక్కనే ఉన్న టమోటా, కర్బూజా తోటలోకి వెళ్లి మందు పిచికారీ చేసిన గడ్డి తిన్నాయి. దీంతో 42 గొర్రెలు మృతి చెందినట్లు రైతులు వాపోయారు. ఇటీవల ఒక్కొక్క గొర్రెను రూ.12వేలతో కొనుగోలు చేశామని, ప్రస్తుతం వాటి విలువ రూ.4.50 లక్షల వరకు ఉంటుందని, ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని కోరారు. పశు సంవర్ధక శాఖ వైద్యులు డాక్టర్ అశ్వర్థనారాయణ, డాక్టర్ వరెకెరప్ప గొర్రెలకు పోస్టుమార్టం నిర్వహించి నివేదిక ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలియజేశారు.

5555 కేజీల నాణేలతో స్వామీజీకి తులాభారం

బెంగళూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): తులాభారం సాధారణంగా ఓ వ్యక్తి తూకంతో కొలుస్తారు. బెల్లం, నగదు, ఇతరత్రా వస్తువులను మనిషి బరువుకు సమానంగా ఉంచుతారు. ఏకంగా ఓ ఏనుగుపై స్వామీజీని కూర్చోబెట్టి తులాభారం జరిపి రికార్డు సృష్టించారు. గదగ్ జిల్లా శిరహట్టి ఫకీర్ సిద్ధరామ స్వామీజీ అమృత మహోత్సవంలో ప్రత్యేకమైన తులాభారం జరిగింది. హుబ్బళ్ళిలోని నెహ్రూ మైదానంలో గురువారం జరిగిన కార్యక్రమంలో 5,555 కేజీల నాణేలతో సిద్ధరామ స్వామీజీకి తులాభారం జరిపారు. మూరుసావిర మఠం నుంచి శోభాయాత్ర ఆరంభం కాగా ఐదు ఏనుగులు, ఐదు ఒంటెలు, ఐదు గుర్రాలతో కళాబృందాలు సాగాయి. ఫకీర్ సిద్ధరామ స్వామి, దింగాలేశ్వర స్వామిజీ, మూరుసావిర మఠ మూజగు స్వామిజీలతోపాటు వందలాదిమంది మఠాధిపతులు పాల్గొన్నారు. అంబారీపై ఫకీరు సిద్ధరామరస్వామిజీని ఆశీనులు చేసి తులాభారం జరిపారు. కేంద్ర ప్రహ్లాద్‌జోషి పరిషత్ సభాపతి బసవరాజ్ హొరట్టి, బీజేపీ అధ్యక్షుడు విజయేంద్ర, మాజీ సీఎంలు బసవరాజ్ బొమ్మై, జగదీశ్ శెట్టర్, మంత్రులు ఎంబీ పాటిల్, హెచ్‌కే పాటిల్, ఈశ్వర్‌ఖండ్రె, ఎమ్మెల్యేలు అరవింద బెల్లద్, శ్రీనివాస్‌మానె, సలీం అహ్మద్‌తోపాటు పలువురు పాల్గొన్నారు. హుబ్బళ్ళికి చెందిన భక్తులు సిద్ధరామస్వామిజీ, దింగాలేశ్వరస్వామీజీకి 3 కేజీల బంగారాన్ని కానుకగా ఇచ్చారు. భారీ సంఖ్యలో అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.



స్వామీజీకి తులాభారం, సిద్ధరామ స్వామీజీ (ఇన్‌సెట్‌లో..)

5న మల్లేశ్వరంలో త్యాగరాజ ఆరాధనోత్సవాలు

బెంగళూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): అఖిల కర్ణాటక బ్రాహ్మణ మహాసభ మల్లేశ్వరం శాఖ ఆధ్వర్యంలో ఈనెల 5న త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు జరుగనున్నాయి. ఈ మేరకు సంస్థ నగరంలో శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. మల్లేశ్వరంలోని కాడుమల్లేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో సాయంత్రం 4 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్య క్రమంలో రాజాజినగర్ సచ్చిదానంద అద్వైతాశ్రమానికి చెందిన పీఠాధిపతి అద్వయానందేంద్ర సరస్వతి, మైసూరుకు చెందిన డా.అభినవ రామానుజాచార్యులు, కోలారు జిల్లాకు చెందిన విద్యావల్లభ మాధవతీర్థ స్వామిజీ, కాంగ్రెస్ నేత అనూప్ అయ్యంగార్ తది తరులు పాల్గొననున్నారు. ఇదే సందర్భంగా విద్వాన్ వీ శ్రీనివాస్ బృందంచే త్యాగరాజస్వామి కీర్తనల ఆలాపన ఉంటుందని ప్రకటనలో పేర్కొన్నారు.

ఉత్పాదనా రంగంలో సంప్రదాయేతర ఇంధనవనరుల వాడకం



సదస్సు ప్రారంభంలో ప్రముఖులు

బెంగళూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక రంగ ఉత్పాదనలో గ్రీన్ టెక్నాలజీని దశలవారీగా అమలులోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని మెరిటూర్ సంస్థ ఛైర్మన్ డాక్టర్ ఎన్ ముత్తుకుమార్ పేర్కొన్నారు. తుమకూరు రోడ్డులోని ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 72వ ఇండియన్ ఫౌండ్రీ కాంగ్రెస్ ఐఎఫ్ఈఎస్ 2024 సదస్సును ఉద్దేశించి శుక్రవారం ఆయన ప్రసంగించారు. ఇండియన్ ఫౌండ్రీ కాంగ్రెస్ పరిధిలో వైమానిక, రక్షణ, ఆటోమొబైల్, ఎలక్ట్రికల్ వాహనాల ఉత్పాదనా సంస్థలు కూడా ఉన్నాయన్నారు. ఉత్పాదనా ఖర్చును గణనీయంగా తగ్గించుకునేందుకు సంప్రదాయేతర ఇంధన వనరుల వినియోగమే సరైన పరిష్కార మార్గమన్నారు. ఈ రంగానికి అవసరమైన 80శాతం ఇంధన అవసరాలను సౌరవిద్యుత్ ద్వారా సమకూర్చుకునేందుకు గట్టి ప్రయత్నాలు జరగాలని సూచించారు. ఓల్వో గ్రూప్ ఉపాధ్యక్షుడు డీఎం గిరీశ్ మాట్లాడుతూ ఉత్పాదనా రంగాలకు ఉజ్వల భవిష్యత్ ఉందని దేశ ఐదు ట్రిలియన్ లక్ష్యాలలో ఈ రంగ పాత్ర చాలా ప్రముఖమైన దన్నారు. ఒక ఆటో మొబైల్ రంగం నుంచే అత్యధిక వాటా చేకూరనుందన్నారు. ఇండియన్ ఫౌండ్రీ కాంగ్రెస్ అధ్యక్షుడు రుద్రేగౌడ తదితరులు ప్రసంగించారు. ఈ రంగానికి చెందిన 350కుపైగా సాంకేతిక విభాగాలు పాల్గొంటుండగా దేశ విదేశాలనుంచి 1500మందికిపైగా ప్రతినిధులు పాల్గొంటున్నారు. ఐఐఎఫ్ అధ్యక్షుడు డాక్టర్ సీ చంద్రశేఖర్, నిర్వహణా కమిటీ ఉపాధ్యక్షుడు డీజీ బెనకప్ప, కార్యదర్శులు అంకిత్ దివేకర్, విఘ్నేశ్ రామనన్ తదితరులు ప్రసంగించారు.

ఘనంగా మాచిదేవ జయంతి

బంగారపేట, ఫిబ్రవరి 2: సమాజంలో మార్పుకోసం శ్రమించిన 12వ శతాబ్ధపు బసవణ్ణ సమీకాలీనులైన మడివాళ మాచిదేవ ఆదర్శప్రాయులని రాష్ట్ర నగర మౌలిక సదుపాయాల అభివృద్ధి మండలి అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి అభిప్రాయపడ్డారు. పట్టణంలో మడివాళ క్షేమాభివృద్ధి సంఘం నూతన భవనం ప్రారంభించి మడివాళ మాచిదేవ జయంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలోని మూఢ నమ్మకాలు, అస్పృశ్యత, విద్యలో సరైన అవకాశాలు లేకపోవడం వంటివాటిపై శతాబ్దాల క్రితమే మాచిదేవ పోరాటం చేశారని, అందరికీ సమాన అవకాశాలకోసం కృషి చేశారన్నారు. కాగా ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలతో సామాన్యులు సైతం ప్రయోజనం పొందుతున్నారన్నారు. సంఘం నూతన భవనంపై మరో భవంతి నిర్మించేందుకు తన గ్రాంటునుంచి రూ.5లక్షలు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే ట్రస్టు ఆధ్వర్యంలో మడివాళ సముదాయానికి చెందిన 25 మందికి ఇస్త్రీ బాక్సులు ఇవ్వనున్నట్టు తెలిపారు. మడివాళ సంఘం అధ్యక్షుడు గోవిందప్ప మాట్లాడుతూ వెనుకబడిన వర్గాలలో ఒకటైన మడివాళ సామాజిక వర్గానికి రానున్న రోజుల్లో హాస్టళ్ల నిర్మించాలని, ప్రభుత్వ ఉద్యోగాలలో ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతూ తదితర డిమాండ్లతో ఒక వినతిపత్రాన్ని ఎమ్మెల్యేకు అందచేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రశ్మి, బీఈఓ సుకన్య, పురసభ సభ్యులు వెంకటేశ్, గోవింద, షఫి, భాగ్యమ్మ, సామాజికవర్గ ప్రముఖులు వెంకటేశ్, శ్రీనివాస్, శ్యామ్‌మూర్తి తదితరులు పాల్గొన్నారు.



సంఘం నూతన భవనం, మడివాళ జయంతి సభలో ఎమ్మెల్యే

విద్యా పర్యటనకు పచ్చజెండా



పర్యటనకు పచ్చజెండా ఊపుతున్న బీఈఓ తనుజా

బాగేపల్లి, ఫిబ్రవరి 2: 2023-24 విద్యాసంవత్సరానికి 8వ తరగతి చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ విద్యార్థులకు 'కర్ణాటక దర్శన' పేరిట ప్రముఖ చారిత్రాత్మక ప్రాంతాలను సందర్శించే పర్యటనకు బీఈఓ తనుజా పచ్చజెండా చూపారు. విద్యాశాఖ, పర్యాటకశాఖ, చిక్కబళ్ళాపుర జిల్లా పంచాయతీ సహకారంతో తాలూకాలోని హైస్కూళ్లకు చెందిన 108 విద్యార్థులు, కొంతమంది ఉపాధ్యాయుల నాలుగు రోజుల పర్యటనకు శుక్రవారం బయల్దేరారు. ఈ సందర్భంగా బీఈఓ మాట్లాడుతూ.. విద్యార్థినీవిద్యార్థులకు ఉచిత బస్సు, మధ్యాహ్న భోజనం, అల్పాహారం, బస చేసే అవకాశం కల్పించినట్టు తెలిపారు. అవసరమైన నోటు పుస్తకం, బ్యాగ్, పెన్ను, టోపి, టీ షర్ట్, గుర్తింపు పత్రం విద్యార్థులకు ఇచ్చామన్నారు. తొలిరోజు శ్రీరంగపట్టణ చూసి రాత్రి మైసూరులో బస చేస్తారని, రెండో రోజు మైసూరు, మడికేరి, భాగమండల, మూడోరోజు శ్రావణబెళగొళ, హళేబీడు వీక్షించి బేలూరులో రాత్రి బస చేస్తారన్నారు. నాల్గో రోజు బేలూరు వీక్షించి యడియూరును తిలకించి వాపసు వస్తారన్నారు. ఈ సందర్భంగా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు, పురసభ సభ్యుడు ఏ నంజుండప్ప, సమన్వయ అధికారి వెంకటరామ్, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడు ఆర్ హనుమంతరెడ్డి, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు పీ వెంకటరవణ, ప్రధాన కార్యదర్శి వెంకటరాయప్ప తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సంఘం తాలూకా అధ్యక్షుడిగా నారాయణస్వామి

శిడ్లఘట్ట, ఫిబ్రవరి 2: తాలూకా న్యాయవాదుల సంఘానికి అధ్యక్షుడిగా ఏ నారాయణస్వామి గెలుపొందారు. 42ఏళ్లుగా ఏకగ్రీవంగా కొనసాగుతున్న ఇదు తరుణంలో ఇదే తొలిసారి టీవీ చంద్రశేఖర్, నారాయణస్వామి వర్గాల మధ్య పోటీ నెలకొనగా ఏ నారాయణస్వామి వర్గం గెలుపొందింది. కోర్టు ఆవరణలో ఏర్పాటైన కార్యక్రమంలో విజయోత్సవం సందర్భంగా మిఠాయిలు పంపిణీ చేసి నూతన అధ్యక్షుడు ఏ నారాయణస్వామి మాట్లాడుతూ సీనియర్లు తనపై ఉంచిన విశ్వాసంతో గెలుపు సాధ్యమైందని రానున్న రోజుల్లో సంఘం బలోపేతానికి పాటుపడతానన్నారు. నూతన కార్యవర్గంగా ఉపాధ్యక్షుడిగా మునిశామిగౌడ, ప్రధాన కార్యదర్శిగా సీజీ భాస్కర్, సంయుక్త కార్యదర్శిగా శహబుద్దీన్, కోశాధికారిగా జీసీ చంద్ర, గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడిగా మంజు కిరణ్, బూదాళ విశ్వనాథ్, శివకుమార్, శరత్, మేలూరు రఘుగౌడ, అమరేశ్‌గా గెలుపొందారని ప్రకటించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు పాపరెడ్డి, అశ్వథ్ నారాయణ, యోగానంద్, రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.



న్యాయవాదుల సంఘం నూతన పదాధికారులు తదితరులు

కియోనిక్స్ అధ్యక్షుడిగా ఎమ్మెల్యే శరత్ బచ్చేగౌడ బాధ్యతలు

బెంగళూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కియోనిక్స్ అధ్యక్షునిగా నియమితులైన హొస్కొటె ఎమ్మెల్యే శరత్ బచ్చేగౌడ శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. బెంగళూరు శాంతినగర్‌లోని కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి డికె.శివకుమార్ పాల్గొని ఆయనను ప్రత్యేకంగా అభినందించారు. లోక్‌సభ సభ్యుడు బీఎన్ బచ్చేగౌడ తదితరులు ఈ సందర్భంగా హాజరయ్యారు. కియోనిక్స్ ద్వారా యువత నైపుణ్య ప్రమాణాలను పెంచేందుకు కృషి చేస్తానని శరత్ బచ్చేగౌడ తెలిపారు. తనపై విశ్వాసం ఉంచి ఈ కీలక బాధ్యతలను అప్పగించినందుకు ఆయన అధిష్ఠానం పెద్దలకు ధన్య వాదాలు తెలిపారు. కియో నిక్స్ ఉన్నతాధికారులు తదితరులు ఈ సందర్భంగా హాజరయ్యారు.



శరత్ బచ్చేగౌడను అభినందిస్తున్న డీసీఎం

పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణం వేగవంతం చేయండి

చేళూరు, ఫిబ్రవరి 2: తాలూకాలోని చిలకలనేర్పు గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో 1నుంచి 7వ తరగతి వరకు 49మంది విద్యార్థులు ఉన్నారు. ముగ్గురు ఉపాధ్యాయులు బోధనలు చేస్తున్నారు. అయితే పాఠశాల ఆవరణలో రెండు మరుగుదొడ్లను ఏర్పాటు చేసే అంశం ప్రతిపాదన ఉన్నా నిర్మాణాలు సగంలో నిలిపివేయడంతో అందుబాటులోకి రాలేదు. దీంతో విద్యార్థినీ విద్యార్థులు ఎంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీస సదుపాయాలు కల్పించడంలో జాప్యం సరికాదని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. వెంటనే మరుగుదొడ్ల నిర్మాణ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని, నీటి సదుపాయం కల్పించాలని కోరుతున్నారు.



పాఠశాల

బ్రాహ్మణసంఘం తాలూకా అధ్యక్షుడిగా నాగభూషణం

చేళూరు, ఫిబ్రవరి 2: చేళూరు తాలూకాలోని బ్రాహ్మణులను ఒక్కతాటిపైకి తెచ్చేలా కొత్తగా సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఈమేరకు తాలూకా బ్రాహ్మణసంఘానికి గుర్తింపు పొందేలా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో నమోదు చేయించారు. చేళూరు తాలూకా బ్రాహ్మణ సంఘం అధ్యక్షులుగా నాగభూషణం ఏకగ్రీవంగా ఎంపికైనట్టు ప్రకటించారు. ఈ సందర్భంగా నాగభూషణం మాట్లాడుతూ సంఘం బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు రాఘవేంద్ర, నరసింహమూర్తి, రాఘవ, శ్రీకాంత్, అశ్వత్థనారాయణ తదితరులు పాల్గొన్నారు.



నాగభూషణం

ఆపరేషన్ కాకుండా బీజేపీకి ఏం తెలుసు..?

▸▸ సీఎం సిద్ధరామయ్య

బెంగళూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రజల విశ్వాసం, నమ్మకాలు సాధించడంలో విఫలం చెందిన బీజేపీకు ఆపరేషన్ కాకుండా ఇంకేమి తెలియదని నగదు ద్వారా ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి మెజారిటీ పొందుతారని సీఎం సిద్ధరామయ్య ఆరోపించారు. ముద్దేబిహాళ్ శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు విజయేంద్రతో పాటు జగదీశ్ శెట్టర్‌లు కాంగ్రెస్ నుంచి మరింత మంది బీజేపీ వైపు వస్తారనే వ్యాఖ్యలపై సీఎం మండిపడ్డారు. గతంలోను బీజేపీ రెండు సార్లు ఇదేతరహాలోనే ఎమ్మెల్యేలను అక్కున చేర్చుకున్నారన్నారు. 2008 నుంచి యడియూరప్ప, బసవరాజ్‌బొమ్మై పాలన సాగిందన్నారు. ఎమ్మెల్యేలు చిక్కితే కొనుగోలు చేసుకుని ప్రభుత్వం ఏర్పాటు చేయడమే అన్నారు. రాష్ట్ర ప్రజలు బీజేపీకు సంపూర్ణ అధికారం ఇవ్వలేదన్నారు. 2008, 2013, 2018లలోను పూర్తి మెజారిటీ సాధ్యం కాలేదన్నారు. 2023లో కాంగ్రెస్‌కు 136 స్థానాల సంపూర్ణ మద్దతు వచ్చిందన్నారు. కాంగ్రెస్‌కు ప్రజలు విశ్వాసం ఉందని బీజేపీ ఆపరేషన్ కమల ద్వారా అధికారంలోకి వస్తారన్నారు. బీజేపీ అధ్యక్షులు విజయేంద్ర మండ్య జిల్లా కెరగూడు హనుమంతుడి జెండా వివాదాన్ని సీబీఐ ద్వారా విచారణలు జరిపించాలనే డిమాండ్‌పై స్పందిస్తూ అతడికి వాస్తవమే తెలియదని ఎద్దేవా చేశారు. బీజేపీ వారికి జాతీయజెండా పట్ల గౌరవం లేదని మండిపడ్డారు.

గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఆరు బిల్లులు

▸▸ న్యాయశాఖ మంత్రి హెచ్‌కే పాటిల్

బెంగళూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): శాసనసభ ఉభయ సభల ఆమోదం పొం దిన తర్వాత గవర్నర్‌కు పంపిన 19 బిల్లుల్లో ఇంకా ఆరింటికి మోక్షం దక్కలేదని అవి రాజ్‌భవన్‌లోనే పెండింగ్‌లో ఉన్నాయని న్యాయశాఖా మంత్రి హెచ్‌కే పాటిల్ పేర్కొన్నారు. నగరంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ముఖ్యంగా యల్లమ్మనగుడ్డ అభివృద్ధి బోర్డు, బాంబే పబ్లిక్ ట్రస్టు వీటిలో ఉన్నాయన్నారు. ఇందుకు సంబంధించి రాజ్‌భవన్‌లో పత్రవ్యవహారాలు జరుగుతున్నాయని వివరించారు. కర్ణాటక హైకోర్టు సవరణ బిల్లు 2023ను మంత్రిమండలి ఆమోదించకుండానే శాసనసభలో ప్రవేశపెట్టిన వైనంపై గవర్నర్ అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తె లిసింది. సాంకేతిక కారణాలతోనే 6 బిల్లులు రాజ్‌భవన్‌లో పెండింగ్‌లో ఉన్నాయని అధికారులను ఉటంకిస్తూ తెలిసింది.

ట్రాఫిక్ సమస్యను గుర్తించేందుకు నగరంలో డ్రోన్ కెమెరాలు

బెంగళూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతున్న తరుణంలో ట్రాఫిక్ పోలీసులు కొత్త ప్రయోగానికి సిద్ధమయ్యారు. ప్రధానంగా పది కీలక ప్రాంతాలలో డ్రోన్‌ల ద్వారా ట్రాఫిక్ కారణాలను గుర్తించదలచారు. ప్రస్తుతం ట్రాఫిక్ విభాగం అందుకు సంబంధించిన వీడియోలను ఎక్స్ ద్వారా విడుదల చేశారు. నిరంతరం రద్దీగా ఉండే ప్రాంతాలలో డ్రోన్‌ల ద్వారా ఎందుకు ట్రాఫిక్ రద్దీగా మారిందో గుర్తించి పర్యవేక్షణాధికారులకు సమాచారం చేరవేస్తాయి. దీంతో వెంటనే సిబ్బంది అక్కడికి చేరుకుని సమస్యను పరిష్కరించదలచారు. వాహన సంచారం సులభతరం చేసేందుకు ఎక్కువ కాలం రోడ్డుపైనే వాహనాలు నిలిచిపోకుండా చేసేందుకు డ్రోన్‌కెమెరాలు సహాయకారి కానున్నాయని పోలీసు అధికారులు అభిప్రాయపడుతున్నారు. నగరంలో ప్రధానంగా హెబ్బాళ, సిల్క్‌బోర్డు, ఇబ్బళూరు, మారతహళ్ళి, కేఆర్‌పురం, గురుగుంటపాళ్య, సారక్కి, బనశంకరి బస్టాండ్‌తో పాటు మరిన్ని ప్రాంతాలలో డ్రోన్‌కెమెరాల ద్వారా పర్యవేక్షణ సాగుతోందన్నారు. వాహనాలు స్థంభించడం, ప్రమాదాలు, స్వల్ప ప్రమాదాలతో వాహనదారుల గొడవల వంటి వాటిని వెంటనే గుర్తించగలిగితే ఎక్కువ సమయం రద్దీ ఉండదని అమలు చేయదలచినట్లు ప్రకటించారు.

8న హులిగిలో ఉచిత వైద్య శిబిరం

బెంగళూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కొప్పళ జిల్లా గంగావతి తాలుకా శ్రీరామ నగరకు చెందిన స్వామి వివేకానంద సేవా సంఘం, బెంగళూరుకు చెందిన వైదేహి ఆసుపత్రి, గంగావతికి చెందిన మారుతి కంటి ఆసుపత్రి సహకారంతో ఈ నెల 9 హులిగిలో ఉచిత ఆరోగ్య పరీక్షా శిబిరాన్ని ఏర్పాటు చేస్తోంది. ఈ మేరకు స్వామి వివేకానంద సేవా సంస్థ అధ్యక్షుడు గారపాటి రామకృష్ణ నగరంలో శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ శిబిరం హులిగిలోని హులిగమ్మదేవి గుడి ఆవరణలో ఈ నెల 8న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు జరుగనుంది. శిబిరంలో నేత్ర పరీక్షలతో పాటు హృద్రోగ, కేన్సర్, నరాల బలహీనత, కీళ్ళ నొప్పులు, కిడ్నీలో రాళ్ళు, వంటి ఆరోగ్య సమ్యలపై ఉచిత పరీక్షలతో పాటు వైద్యుల సలహాసూచనలు ఉంటాయని ఆసక్తి గలవారు ప్రసాద్ వెంకటరావ్‌ను 9611511149కు సంప్రదించాలని ప్రకటనలో కోరారు.

ఎస్టీ జాబితాలోకి కాడుగొల్లలు

▸▸ మాజీ ప్రధాని దేవెగౌడతో కేంద్రమంత్రి చర్చలు

బెంగళూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో కాడుగొల్లలను ఎస్టీ జాబి తాలోకి చేర్చే అంశంపై ఢిల్లీలో శుక్రవారం మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడతో కేంద్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి ఏ నారాయణస్వామి చర్చలు జరిపారు. ఏ కులా నైనా ఎస్సీ, ఎస్టీ జాబితాలో చేర్చే అంశంపై 1999లో రూపొందించిన చట్టం ప్రకారం తొలుత కేంద్రానికి ప్రతిపాదనలు పంపాల్సి ఉంటుంది. దీనికి రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా, జాతీయ ఎస్టీల కమిషన్ సమ్మతిస్తేనే తుది నిర్ణయం తీసుకునే అవకాశం లభిస్తుంది. ప్రధానితో చర్చించి దీనిపై నిర్ణయం తీసుకుం టామని కేంద్రమంత్రి నారాయణస్వామి మీడియాకు తెలిపారు. మాజీ ప్రధాని దేవేగౌడ మాట్లాడుతూ ఎస్టీ జాబితాలో తమను చేర్చాలంటూ అడవిగొల్ల కులస్థులు చాలాకాలంగా కోరుతున్నారన్నారు.



మాజీ ప్రధాని దేవెగౌడతో చర్చిస్తున్న మంత్రి

బైనహళ్ళి డెయిరీ అధ్యక్షుడిగా శ్రీనివాసరెడ్డి

చింతామణి, ఫిబ్రవరి 2: తాలూకాలోని మురగమల్లా హోబళి బైనహళ్ళి పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం అధ్యక్షుడిగా వి.శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షుడిగా చౌడరెడ్డి ఎన్నికయ్యారు. ఈ పదవిలో ఐదేళ్లపాటు కొనసాగుతారని ఎన్నికల అధికారిగా వ్యవహరించి వి.రమేశ్ తెలిపారు. జనవరి 21న పాలకమండలి డైరెక్టర్‌ల స్థానాలకు ఎన్నికలు జరగగా అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానాలకు శుక్రవారం ఎన్నికలు జరిగాయి. శ్రీనివాసరెడ్డి, చౌడరెడ్డిలు మాత్రమే నామినేషన్ వేయడంతో ఏకగ్రీవమైనట్టు రమేశ్ వివరించారు. నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులను ప్రత్యేకంగా అభినందించారు.



శ్రీనివాసరెడ్డి